# పెద్దబాలశిక్ష

నాలుగురోడ్ల కూడలి - రేపల్లె వైపు వెళ్లే బస్సు తూర్పునకు అభిముఖంగా నిలబడి ఉంది. దక్షిణం దిక్కునపోయే బాపట్ల బస్సు కూడా అదే సమయంలో వచ్చి ఆగింది. రెండు బస్సులు వచ్చి ఆడడంతో హోటల్లో రద్దీ పెరిగింది.

క్యాష్ కౌంటరు దగ్గరున్న సదానందం లేచినిలబడి టేబుల్స్ అన్నీ నీటుగా వున్నాయో లేదోనని ఓసారి పరీక్షించి చూశాడు. కష్టమర్స్ అడిగినవి సక్రమంగా అందుతున్నాయో లేదోనని సప్లయర్స్‌ను అప్రమత్తం చేస్తూ వున్నాడు తన కేకలతో.

హోటల్లో అంతా సవ్యంగా వుందని అనుకున్నాకల రోడ్డువైపు దృష్టి సారించేడు.

బస్సు దిగి రోడ్డు దాటుకుంటూ హోటల్‌వైపు వస్తున్న ఉదయ్‌ని చూడగానే సదానందం గుండె వేగంగా కొట్టుకుంది. మొహంలో ఆనందం చోటు చేసుకుంటే, కాళ్లు చేతులు తడబడ్డాయి. 'ఉదయ్' అంటూ పెద్దగా కేకవెయ్యబోయి ఆగిపోయాడు గతం గుర్తుకు వచ్చి.

మెదక్ వదిలి పెట్టి వచ్చి ఐదేళ్లు అవుతుంది. పొన్నూరులోని హోటల్ ప్రొప్రైటర్ స్నేహితుడవ్వడంతో అతని దగ్గర కొచ్చేశాడు. హోటల్ నిర్వహణ బాధ్యతలన్నీ సదానందానికి వదిలి హోటల్ ప్రొప్రయిటర్ ఆవూరు, ఈవూరు తిరుగుతూ వుంటాడు.

ఉదయ్ సదానందాన్ని చూడగానే ఆనందం పట్టలేక పరుగులాంటి నడకతో వచ్చి వాటేసుకున్నాడు.

"మీరు ఇక్కడున్నారా? మీ కోసం ఎదురు చూడని రోజులేదు... గాలించని ప్రదేశం లేదు. మమ్మల్ని వదిలి ఐదేళ్లు ఒంటరిగా ఇక్కడ ఓలా ఉండగలిగేరు? మీ కోసం మీ మనవడు కలవరిస్తూ వుంటాడు ఎప్పుడు... తిరిగి మిమ్మల్ని చూస్తే ఎంత సంబరపడి పోతాడో!" అన్నాడు ఉదయ్ ఉద్రేకపడి పోతూ.

కొడుకు భుజాలు ఆప్యాయంగా నిమిరేడు.

ఏదో అనుమానం సదానందం మనస్సును ముట్టడించింది.

కొడుకు మొహంలోకి పరీక్షగా చూశాడు. ఆయన చూపుల్ని పసిగట్టాడు ఉదయ్.

"మీరు వెళ్లిపోయిన దగ్గర్నుంచి మీ కోడలు కూడా బాధపడుతూవుంది. మీరు ఇల్లు విడిచివెళ్లిపోవడానికి కారణం తనేనని మధనపడుతూ వుంది" అన్నాడు ఉదయ్.

కొడుకు మాటలు వినగానే స్థిమితపడింది. సదానందం మనస్సు.

క్యాష్ కౌంటరుకు పక్కనున్న టేబుల్ దగ్గర కొడుకును కూర్చోబెట్టి తనూ పక్కన కూర్చున్నాడు.

ఓ సర్వర్‌ని పిలిచాడు.

"ఈ అబ్బాయి ఎవరనుకుంటున్నావ్? నా కొడుకే... పేరు ఉదయ్... కంట్రాక్టరు... లక్షలు లక్షలు సంపాదించేడు..." ఏదో చెప్పబోయాడు సదానందం.

" అంత ఆస్తి వున్నవాళ్లు కొడుకును లక్షల్ని వదిలేసి ఈ హోటల్‌కి కాపలాకొస్తున్నారేంటి?" సదానందం తనతో పరాచికాలు ఆడుతున్నాడనుకుంటూ అడిగేడు సర్వర్.

"నా కొడుకేనోయ్... ఆరోగ్యం సరిగ్గా లేక డాక్టర్లు గాలి మార్పు కావాలంటే నేను ఇక్కడికొచ్చాను"

తండ్రి అసలు విషయం చెప్పకుండా తన పరువు కాపాడినందుకు మనస్సులో తండ్రికి నమస్కరించేడు ఉదయ్.

సర్వర్ కుర్రాడు ఉదయ్‌వైపు పరిశీలనగా చూశాడు. సదానందం పోలికలు కొట్టొచ్చినట్లు కనిపించేయి.

"మీ అబ్బాయేనండి... వేడివేడి ఇడ్లీ... కాఫీ తీసుకొస్తాను" అక్కడి నుండి పరుగెత్తబోయాడు సర్వర్ కుర్రాడు.

"పెసరట్టు కూడా చెప్పు. అల్లం ముక్కలు, ఉల్లిపాయలు వేయమను... పెసరట్టు అంటే మావాడికి యిష్టం" అన్నాడు సదానందం.

"బాపట్ల వరకు వెళ్లాదమని ప్రయాణమయ్యాను... మీరు ఇక్కడ కనిపించేరు...బాపట్ల ప్రయాణం మరోసారి... బస్సులో బ్రీఫ్‌కేసు వుంది తెచ్చేసుకుంటాను" అన్నాడు ఉదయ్.

తలూపేడు సదానందం.

ఉదయ్ బస్సు దగ్గరకు వెళ్లాడు.

"అబ్బాయిగారు ఏరండీ?" ప్లేటులో పెసరట్టు పట్టుకొచ్చిన కుర్రాడు సదానందాన్ని అడిగాడు.

"బ్రీఫ్‌కేసు తెచ్చుకోవడానికి బస్సు దగ్గరకు వెళ్లాడు".

"మీరు నిజంగా గాలిమార్పు కోసమే ఇక్కడకు వచ్చారా?" నవ్వుతూ అడిగేడు కుర్రాడు.

ఆ కుర్రాడు కూడా ఐదేళ్ళ క్రితం ఇంట్లో తండ్రి కోప్పడ్డాడని అలిగి వచ్చేసినవాడే.

సదానందం సమాధానం చెప్పకుండా రోడ్డువైపు చూస్తూవుండిపోయాడు. ఆయన మనస్సు గతంలోకి జారుకుంది.

... భార్య చనిపోవడం జీవితంలో పెద్ద ఆగాధం ఏర్పడినట్లయ్యింది.

ఉదయ్‌ను డాక్టర్ని చేయాలని తను తాపత్రయపడితే వాడు చదువు అటకెక్కించి డిగ్రీ కూడా పూర్తి చేయకుండా చదువు మానేశాడు. కాంట్రాక్టరయ్యాడు. లక్షలు, లక్షలు సంపాదించేడు.

అయినా తనకేదో అసంతృప్తి...

తనేదో సంబంధం చూస్తే ఉదయ్‌కి నచ్చలేదు. తను ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని మంకుపట్టుపట్టాడు. తను ఊరుకుంటాడా? వాడిమెడలు వంచి తను అనుకున్న సంబంధమే చేశాడు.

కానీ ఆ తరువాత జరిగిందేమిటి?

ఇంటికొచ్చిన కోడలు తన కొడుకును కొంగున ముడివేసుకుని తనమీదే పెత్తనం చలాయించడం మొదలు పెట్టింది.

అందరిని శాసించినవాడేగాని తను మరొకరి మాట వినేరకం కాదు... ఇంట్లో అడ్జెస్టు కాలేకపోయాడు.

తన పద్ధతులు కోడలు మృదులకు నచ్చేవి కాదు.

కొడుకు కోడలుతో మాట్లాడటానికి ఇంటి కొచ్చిన గెస్టులతో తను గంటలతరబడి మాట్లాడటం ఆమెకు నచ్చేది కాదు. గెస్టులు వచ్చినప్పుడు తనను మేడపైన గదిలో కూర్చోమనేది.

డైనింగ్ టేబుల్ దగ్గర కూరగిన్నెల్లో చేతులు పెట్టి కూరలు వడ్డించు కోవడం, పప్పు చారు గిన్నెలో ములక్కాడల కోసం చేతివేళ్ళతో తను వెతుక్కోవడం ఆమెకు నచ్చేదికాదు. స్పూన్‌తో కాకుండా చేతులు గిన్నెల్లో పెట్టినప్పుడు ఆమెకు వాంతి వచ్చినట్లుండేది. కరెక్టుగా టైం ప్రకారం బ్రేక్‌ఫాస్ట్ కుగాని, భోజనానికిగాని వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోవాలి. మొహం కడుక్కుంటూ నోట్లోని పేస్టు నురగ కొబ్బరి చెట్టు పాదుల్లో ఉమ్మితే ఊరుకునేది కాదు.

మృదుల ఏం మాట్లాడినా చివాట్లు పెట్టినట్లుగా వుండేది.

"అమ్మమాటలు నువ్వు పట్టించుకోకు తాతయ్యా!" అనేవాడు మనవడు వరుణ్.

మనవడు తన పక్కన జేరితే మనస్సులో గూడుకట్టుకున్న దిగులంతా దూదిపింజెలా ఎగిరిపోయేది.

ఓ రోజు బజారు నుంచి తెచ్చిన కేక్ వరుణ్‌కు పెట్టారు.

"ఈ రోజు మీ నాయనమ్మ నేనూ పెళ్ళి చేసుకున్న రోజురా' చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకుంటూ అన్నాడు మనవడితో.

"నాయమన్మ ఎలా వుండేది తాతయ్యా? మా అమ్మలాగా కోపిష్టిదా?" అడిగేడు వరుణ్.

"మీ నాయనమ్మ దేవతరా.. ఈ దుర్వాసుడితో కలిసి బతుకుబండి యాభైయేళ్లు లాగింది. నామీద కోపం వచ్చిందేమో మాటామంతి లేకుండా పైకి వెళ్ళిపోయింది.

నాయనమ్మ గూర్చి పాత సంగతులు చెబుతూవుంటే చెవులు అప్పగించి వింటూ వుండిపోయాడు వరుణ్.

చదువుకోకుండా తాతగారి గదిలో చేరి కబుర్లు వింటున్నాడని మండిపడుతూ వచ్చింది మృదుల.

కేక్ తింటూ ఆసక్తిగా తాతగారి కబుర్లు వింటున్న వరుణ్ కన్పించేడు ఆమెకు.

"ఇక్కడ కూర్చుని అడ్డమైన తిండి తింటున్నావా?" వరుణ్ చెవిమెలిపెట్టి ఆ గదిలోంచి వరుణ్‌ను తీసుకువెళుతూ అంది మృదుల. మనవడు బిక్కమొహం వేసుకుని గదిలో నుంచి వెళ్ళడం చూసి తన మనస్సు బాధతో మూలిగింది.

ఉదయ్ ఇంటికి రాగానే వరుణ్ చదువుకోవడం లేదని చెప్పింది మృదుల.

"వీడసలు చదవడం లేదండీ... ఎప్పుడూ మామయ్యగారి గదిలో చేరి కబుర్లు చెబుతూ

వుంటాడు... ఆయనేమో వీడికి బజారు నుండి అడ్డమైన గడ్డి తెచ్చి మేపుతున్నాడు. ఇంట్లో తిండి సయించదు వీడికి... రేపు రోగం వచ్చి మంచానపడితే ఏడ్చి మొత్తుకునేది నేనేగా!" అందామె.

కొడుకు భుజం పట్టుకుని దగ్గరకు లాక్కుని చెంపమీద గట్టిగా కొట్టేడు ఉదయ్.

వరుణ్‌కు రోషం వచ్చింది. ఏ తప్పు చేయకపోయినా తనను కొట్టినందుకు.

"అనవసరంగా ఎందుకు కొడతారు? తాతగారు కేకు ముక్కయిస్తే అది తింటే తప్పా? తాతగారితో మాట్లాడ్డం కూడా తప్పేనా?" ఎదురు ప్రశ్నలు వేశాడు వరుణ్ రోషంతో ఊగిపోతూ.

"ఇక లాభం లేదండి... మనకే ఎదురు తిరిగి మాట్లాడే స్థాయికి వచ్చాడు... ఇక్కడవుంటే వీడికి చదువురావు... రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించుదాం" అంది మృదుల.

ఆమె నోట్లో నుంచి మాట ఊడిపడిందంటే అది అక్షలారా అమలు జరగాల్సిందే! మనవడిని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్చించవొద్దని కొడుక్కి చెప్పాడు. తన మాట ఎవరూ వినిపించుకోలేదు. వరుణ్‌ని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాడు.

ఆ సంఘటన తన మనస్సును బాగా కలిచి వేసింది.

ఇంట్లో ఉండలేకపోయాడు. ఎవ్వరికీ చెప్పకుండా దూరంగా వచ్చేశాడు...

ఉదయ్ వచ్చి పెసరట్టు తినడం మొదలు పెట్టాడు.

"సాయంత్రం మన ఊరికి తిరిగి వెళ్ళి పోదాం నాన్నగారూ!" అన్నాడు ఉదయ్.

"నేను రానులే! నువ్వెళ్ళు... నాకు యిక్కడ బాగానే ఉంది... ఈ హోటల్ ప్రొప్రయిటర్ నన్ను కన్నతండ్రిలా చూసుకుంటున్నాడు" అన్నాడు సదానందం.

సర్వర్ పొగలు కక్కే వేడివేడి కాఫీ తెచ్చియిచ్చాడు వాళ్ళిద్దరికి.

"నాన్నగారూ... మృదుల కొంచెం కటువుగా మాట్లాడిందని మీరింత పట్టుదలగా వున్నారే మరి మీరు చండశాసనుడిలా ప్రవర్తించే వాళ్లు గతంలో... అమ్మని, నన్ను తిట్టని రోజు వుండేది కాదు... వాటిని పట్టించుకోకుండా మీరంటే అభిమానంగా వుండటం లేదూ" అన్నాడు ఉదయ్ కాఫీ చప్పరిస్తూ.

సదానందం మనస్సు మళ్లీ గతంలోకి జారుకుంది.

ఉదయ్‌ని ఒక్క క్షణం ఊపిరి పీల్చుకోనివ్వకుండా ఆడుకోవడానికి బయటకు వెళ్ళనివ్వకుండా ఎప్పుడూ చదువుకోమంటూ సతాయించేవాడు తను.

"జీవితంలో ధ్యేయం అంటూ లేకుండా బతికెయ్యడమంటే కాలో చెయ్యో లేకుండా బతకడమన్నమాట... డాక్టరు కావడమే నీ ధ్యేయం... అది గుర్తు పెట్టుకుని శ్రద్ధగా చదువు" అనేవాడు.

"వాడు శ్రద్ధగానే చదువుతున్నాడు లెండి... క్లాసులో కూడా ఫస్ట్ వచ్చాడు కదా!" అంది సుగుణమ్మ.

"క్లాసుఫస్ట్ వస్తే సరిపోదే... స్టేట్ రాంక్ రావాలి! ప్రతి విషయంలో నువ్వు జోక్యం చేసుకోబోకు... నోరు మూసుకుని వంటిట్లోకి వెళ్లు!" భార్యని తిట్టేడు.

తన మాటకు ఎవరు ఎదురు చెప్పినా, అధిక ప్రసంగం చేసినా ఊరుకునే వాడు కాదు.

ఓ రోజు ఉదయ్ అడిగేడు.

"నాన్నా! మంచి చెడులు అంటారు గదా! చెడు ఎక్కడ నుంచి వొచ్చింది?"

"మంచి అనేదేమో దేవతల నుండి, చెడు రాక్షసుల నుండి వచ్చిందిరా" సమాధానమిచ్చాడు తను.

"దేవతల్ని, రాక్షసుల్ని ఎవరు సృష్టించారు?" మళ్లీ అడిగాడు ఉదయ్.

"దేవుడు"

"రాక్షసులు చెడ్డవాళ్ళని తెలిసికూడా దేవుడు ఎందుకు సృష్టించాడు?"

"రాక్షసుల్ని దేవుడు పుట్టించలేదు అంతకుముందే ఉన్నారు" అని అందామనుకున్నాడు... 'అలాగయితే చెడు మీద దేవుడికి కంట్రోల్ లేదా? రాక్షసులు దేవతలంతటి వాళ్ళా?' అని మళ్లీ ఉదయ్ ప్రశ్నిస్తే?

కోపం వచ్చింది తనకు... చిన్న కుర్రాడి ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయినందుకు రోషం కూడా వచ్చింది.

"నిన్ను చదువుకోరా అంటే పిచ్చి, పిచ్చి ప్రశ్నలు వేస్తావెందుకు?"

ఉదయ్ జుట్టుపట్టుకుని వాడి తల వంచి వీపుమీద నాలుగు బాదాడు.

ఓ రోజు ఉదయ్‌తో మాట్లాడటానికి వాడి స్నేహితుడు కిరణ్ వచ్చాడు.

"ఉదయ్ వున్నారండి యింట్లో" అడిగాడు కిరణ్.

"లేదబ్బాయ్... బజారుకు వెళ్ళాడు" అనేశాడు తను.

ఉదయ్ ఇంట్లో కూర్చుని చదువుకుంటున్నాడని తనకు తెలుసు. కొడుకు చదువుకు అవాంతరం ఏర్పడటం తనకు ఇష్టంలేదు.

కిరణ్ వెళ్లిపోయారు.

కిరణ్ గొంతువిని ఉదయ్ బయటకు వచ్చాడు.

"కిరణ్ వచ్చింది. నా కోసమేనా?" అడిగాడు.

"పని పాటలు లేకుండా తిరుగుతూ వుంటారులే.. వాళ్లు చదువుకోరు, ఇంకొకరిని చదువుకోనివ్వరు" విసుక్కున్నాడు తను.

"కిరణ్ బాగా చదువుతాడు నాన్నా! నాతోపాటు వాడికి చాలా సబ్జెక్టుల్లో ఫస్ట్ మార్కులు వచ్చాయి... ఆటల్లో కూడా ప్రయిజులు వచ్చాయి".

"నీతోపాటు వాడికి సమానంగా రావడం ఏమిటి? వాడికంటే నీకు మార్కులు ఎక్కువ రావాలి".

"ఇంట్లో నేను లేనని కిరణ్‌కు ఎందుకు అబద్ధం చెప్పావ్?"

ఉదయ్ తన అధికారాన్ని, పెద్దరికాన్ని లెక్క చెయ్యకుండా మాట్లాడినట్లు అనిపించింది.

ఆరోజు ఉదయ్‌ని చావబాదేశాడు.

భార్యను కూడా అంతే! అమె నోరు ఎత్తనిచ్చేవాడు కాదు తను.

పేరుకు తగ్గట్లు సుగుణాలు రాశి కాబట్టి తన మాటకు ఎదురు చెప్పేది కాదు.

తన మొండి తనం, మితిమీరిన క్రమశిక్షణ బాగా చదువుకునే ఉదయ్‌ను మొద్దుబారేటట్లు చేశాయి.

ఇంటర్‌లో తప్పి కూర్చున్నాడు. డాక్టర్ని చేయాలని తను కలలుకంటే దేవుడు వాడిని కంట్రాక్టర్ని చేశాడు.

బయట బాగా ఎండ కాస్తుందని వాన కురుస్తుందని పూలకుండీలను తెచ్చి ఎప్పుడూ ఇంట్లో పెట్టుకుంటే వాటికి పూలేం పూస్తాయి? ఉదయ్ విషయంలో తను చేసిందంతే! వాడికి స్వేచ్ఛ లేకుండా కట్టడిలో వుంచాడు. తన క్రమశిక్షణతో వాడికి ఊపిరాడక, తను అనుకున్న విధంగా రాణించలేదు.

జీవితం ఓ పెద్దబాలశిక్ష.

కొన్ని కఠినమైన పదాలుంటాయి. మరి కొన్ని తేలిక పదాలుంటాయి. బతుకు పుస్తకంలో నచ్చిన పదాలనే మెదడు పొరల్లోకి ఎక్కించుకుని సంక్లిష్టంగా వున్నాయని కొన్ని పదాలను వదిలేస్తే ఎలా? అన్ని పదాల అర్థాలు తెలుసుకుంటేనే జీవితం పరిపూర్ణమవుతుంది.

కోడలి ప్రవర్తన నచ్చలేదని తను దూరంగా జరిగిపోతే ఎలా?

సర్దుకు పోవాలి...

ఉదయ్ మాటలు వినిపించడంతో సదానందం ఆలోచనలు తెగిపోయాయి.

"మళ్లీ మీరు కనిపిస్తే క్షమాపణలు చెప్పుకోవాలని మృదుల రోజూ అనుకుంటున్నది నాన్నగారూ! మీ మనవడు ప్రతిక్షణం మిమ్మల్ని తలచుకుని దిగులు పడుతున్నాడు. మీరు తిరిగి వస్తారని వాడికి గట్టి నమ్మకం వుందేమో మీకు ప్రెజెంట్ చేయాలని ఓ వెండిపిడివున్న చేతికర్ర కొనుక్కొచ్చాడు..." చెప్పుకు పోతున్నాడు ఉదయ్.

మనవడిని చూడాలనే చిన్న మొక్కలాగా వున్న మనస్సులోని కోరిక పెద్దరావి చెట్టులాగా ఎదిగిపోయింది క్షణాల్లో.

"ఇన్నాళ్లూ ఇంట్లో మనిషిలా అయినవాడిలా చూసుకున్న హోటల్ ప్రొప్రయిటర్‌కు కృతజ్ఞతలు చెప్పి సాయంత్రం మన ఊరికి తిరిగి వెళ్లిపోదాం" అన్నాడు సదానందం. *

**(ఈనాడు ఆదివారం - 20-8-1995)**